సాగుకు నీరు అందేదెలా..

- మట్టపల్లి, గుండ్లపల్లి మేజర్ కాలువల్లో దట్టంగా కంపచెట్లు
- తొలగించాలని రైతుల వేడుకోలు

మఠంపల్లి : మండలంలో ఆయకట్టు చివరి భూములకు సాగు నీరందించే మట్టపల్లి, గుండ్లపల్లి మేజర్ కాలువలు అధ్వానంగా తయారయ్యాయి. ఏడాది కాలంగా ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ కాలువల్లో కంపచెట్లు దట్టంగా పెరిగాయి. దీంతో కాల్వలకు సాగునీరు విడుదల చేసినా చివరి భూములకు నీరందేలా లేదు. అయితే నాగార్జునసాగర్ ఎడమకాలువ పరిధిలోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు అనుసంధానంగా మట్టపల్లి, గుండ్లపల్లి మేజర్ కాల్వలు ఉన్నాయి. మట్టపల్లి మేజర్ పరిధిలో బక్కమంతులగూడెం, ఎర్రగట్టు, మఠంపల్లి, అల్లీపురం, కాలవ్వపల్లితండా, కొత్తండా, భీల్యానాయక్‌తండా, దోనబండతండా, లాలితండాల పరిధిలో సుమారు 8 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంటుంది. అదేవిధంగా గుండ్లపల్లి మేజర్ కాలువ 10 కిలోమీటర్ల పరిధిలోని చౌటపల్లి, మఠంపల్లి, రఘునాథపాలెం, గుండ్లపల్లి తదితర గ్రామాల పరిధిలో



మట్టపల్లి మేజర్ కాలువలో లాలితండా వద్ద దట్టంగా ఉన్న కంపచెట్లు

6 వేల ఎకరాలకు సాగునీరు అందాలి. మరో వారం, పది రోజుల్లో ఆయా మేజర్ కాల్వలకు సాగు నీరు విడుదల చేసే అవకాశం ఉంది. కానీ కాలువలు ఇలా కంపచెట్లమయంగా ఉండడంతో సాగునీరు చివరి భూములకు అందడం కష్టమేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పంట కాల్వలల్ల కంపచెట్లను తొలగించాలని ఆయకట్టు చివరి భూముల రైతులు కోరుతున్నారు.

కంపచెట్లు తొలగించాలి



పంట కాలువలకు మరో వారం రోజుల్లో సాగు నీరు విడుదల చేసే అవకాశం ఉంది. కావున అధికారులు కాలు వల్లో కంపచెట్లను జేసీబీల సహాయంతో వెంటనే తొలగించాలి. ఆయకట్టు చివరి భూములకు నీరందేలా చూడాలి.

– బానోతు బాలునాయక్
లాలితండా, రైతు

చివరి భూములకు సాగునీరు అందేలా చూడాలి



మట్టపల్లి, గుండ్లపల్లి మేజర్ కాలువల్లో దట్టంగా పెరిగిన కంపచెట్లను తొలగించకపోతే సాగునీరు విడుదల చేసినా ఆయకట్టు చివరి భూములకు నీరందడం కష్టమే. అధికారులు స్పందించి కాలువల్లో కంపచెట్లు తొలగించి సాగు నీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలి.

– మాళోతు బాలునాయక్, సీపీఎం
మండల ప్రధాన కార్యదర్శి, మఠంపల్లి

గుంతలమయంగా కాలువ కట్ట



8ఆర్ కాలువ సమీపంలో అధ్వానంగా ఆర్‌కే మేజర్ కాలువ కట్ట



5 ఆర్ కాలువ సమీపంలో ఇలా..

- ప్రతి ఏడాది నాసిరకంగా మరమ్మతు పనులు
- రాకపోకలకు ఇబ్బందులు

చిలుకూరు : మండలంలోని రెడ్లకుంట మేజర్ (ఆర్‌కే మేజర్) కాలువ కట్ట అధ్వానంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కట్టపై గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతల్లో వర్షపు నీరు నిలిచి కాలువ కట్టపై పొలాలకు రాకపోకలు సాగించే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆర్‌కే మేజర్ కాలువ కట్ట పరిధిలో 8ఆర్, 5ఆర్, ఆర్లెగూడెం సమీపంలో పెద్దఎత్తున గుంతలు ఉన్నాయి. కాలువ కట్ట మరమ్మతుల పేరుతో ప్రతి ఏడాది నిధులు ఖర్చు చేస్తున్నా పనులను నాసిరకంగా చేపడుతుండడంతో వర్షాకాలంలో కట్టపై గుంతలు పడడం పరిపాటిగా మారింది. గత ఏడాది కూడా కాలువ కట్టకు మట్టి తోలి మరమ్మతులు చేపట్టారు. అయినా మళ్లీ అధ్వానంగానే తయారైంది. ఈ కాలువ కట్ట గుండా పొలాలకు మాత్రమే కాకుండా చిలుకూరు నుంచి ఆర్లెగూడెం, రామ్‌నగర్ గ్రామాలకు ప్రజలు రాకపోలకు సాగిస్తుంటారు. కావున సంబంధిత అధికారులు స్పందించి ఆర్‌కే మేజర్ కాలుక కట్టకు పటిష్టంగా మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

కృష్ణానది తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మేళ్లచెరువు : నాగార్జునసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నందున చింతలపాలెం మండలంలోని కృష్ణానది తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సురేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాగర్ ప్రాజెక్టు గేట్లు పూర్తిగా ఎత్తడంతో పులిచింతల ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరుతోందని తెలిపారు. నదిలోకి చేపలవేటకు వెళ్లవద్దని హెచ్చరించారు.

వాతావరణం ఆధారంగా సాగు చేపట్టాలి

నడిగూడెం : వాతావరణం ఆధారంగా పంటలు సాగు చేసుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని సిరిపురం రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. వానాకాలం సీజన్‌లో పంటలలో పాటించాల్సిన మెళకువలు వివరించారు. సిరిపురం క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారి రేణుక, రైతులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలని వినతి



రెవెన్యూ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీఓడబ్ల్యూ నాయకులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలని పీఓడబ్ల్యూ నాయకురాళ్లు కోరారు. ఈమేరకు మంగళవారం నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకురాళ్లు మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షురాలు చందనబోయిన లక్ష్మి, ఉపాధ్యక్షురాలు మరియమ్మ, పసుపులేటి మల్లేశ్వరి, సరికొండ శ్యామల, మీసాల సుజాత, నాగేంద్ర తదితరులు ఉన్నారు.

వ్యాధుల నియంత్రణకు ఫీవర్ సర్వే



పరెడ్డిగూడెంలో ఇంటింటి సర్వే చేస్తున్న మండల వైద్యాధికారి నరేష్, సిబ్బంది

గరిడేపల్లి : సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి నరేష్ తెలిపారు. మంగళవారం మండలంలోని పరెడ్డిగూడెం గ్రామంలో సిబ్బంది చేపడుతున్న ఫీవర్ సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుత సీజనల్‌లో జ్వరాల బారిన పడకుండా ప్రతిఒక్కరూ నీటిని వేడి చేసి చల్లార్చుకొని వడపోసి తాగాలన్నారు. గ్రామంలో గర్భిణులకు బీపీ చెక్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ఎ.రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, రేణుక, ఏఎన్‌ఎం విజయ, ఆశా కార్యకర్తలు భవాని, స్వర్ణ, బూబమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఆత్మీయ భరోసా' అమలు చేయాలి

గరిడేపల్లి : ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేసి భూమిలేని వ్యవసాయ కార్మికులకు సహకారం అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో నిరుపేదలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో గురుకుల పాఠశాల నిర్మించి అందులో నిరుపేద వ్యవసాయ కార్మికుల పిల్లలకు నిర్బంధ ఉచిత విద్య అందించి ఆదుకోవాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఆరోగ్య విస్తరణాధికారి

నడిగూడెం : పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం లభిస్తుందని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణాధికారి చంద్రశేఖర్ రాజు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 'పరిశుభ్రతతోనే ఆరోగ్యం'అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వర్షాకాలం దృష్ట్యా నీరు నిలిచి దోమల సంచారం పెరుగుతుందని, సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. కావున ప్రతిఒక్కరూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, ఏఎన్‌ఎం సుజాత, ఆశా కార్యకర్తలు శ్రీలక్ష్మి, లక్ష్మి, సునిత, సైదమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాన్‌పహాడ్ మేజర్ కాలువకు నీటి విడుదల

నేరేడుచర్ల : నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నుంచి ఎడమ కాలువకు నీటిని విడుదల చేయడంతో దానికి అనుబంధంగా ఉన్న జాన్‌పహాడ్ మేజర్ కాలువకు మంగళవారం ఎన్నెస్పీ ఏఈలు ప్రసన్న, నవీన్ నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాన్‌పహాడ్ మేజర్ కాలువ పరిధిలో సుమారు 333 వేల ఎకరాలు ఆయకట్టు సాగు అవుతుందని, దీనికి ప్రస్తుతం 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. మరో 100 క్యూసెక్కుల నీటిని త్వరలో విడుదల చేస్తామని తెలిపారు. కాలువ చివరి భూములకు పూర్తిస్థాయిలో నీరందిస్తామని అన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము, లక్ష్మయ్య, పవర్



జాన్‌పహాడ్ మేజర్ కాలువకు నీటిని విడుదల చేస్తున్న ఎన్నెస్పీ అధికారులు

ప్లాంటు సిబ్బంది వేణుగోపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్లు సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, యలంచెరువు రవీందర్‌రెడ్డి, కోటిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని వినతి

మునగాల : మండలంలోని గణపవరం శివారులో గల చెరువుశిఖం భూమి విషయంలో గత ఏడాదిగా దళిత కుటుంబాలపై మునగాల ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ అక్రమంగా కేసులు నమోదు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, సదరు ఎస్‌ఐపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గణపవరంనకు చెందిన పలువురు దళిత కుటుంబాలు చెరువుశిఖం భూమిని ఎన్నో ఏళ్లుగా సేద్యం చేసుకొని జీవనం సాగిస్తుండగా గ్రామానికి చెందిన గోపిరెడ్డి నాగిరెడ్డి అనే భూస్వామి ఆరిని వేధిస్తూ తప్పుడు కేసులు పెడుతున్నాడని ఆరోపించారు. చెరువుశిఖం భూమిలో దళితులకు భూమి యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాధిత దళిత కుటుంబాలకు చెందిన సూరే



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దళిత సంఘం నాయకులు

పల్లి రాములు, సూరేపల్లి గోపి, సూరేపల్లి రమేష్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూరి స్వరాజ్యం, వీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉడుం కృష్ణ, బీఆర్‌ఎస్ మండల అధికార ప్రతినిధి ఎల్‌పీ రామయ్య, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సూరేపల్లి రమేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు సూరేపల్లి పిచ్చయ్య, సూరేపల్లి కోటయ్య, సూరేపల్లి వెంకన్న, మాతంగి భిక్షం, బచ్చలకూరి వెంకటేష్, సూరేపల్లి గోపి పాల్గొన్నారు.

పెన్షన్‌దారుల సదస్సును జయప్రదం చేయాలి

నేరేడుచర్ల : హుజూర్‌నగర్‌లోని లక్ష్మీనర్సింహా ఫంక్షన్ హాల్‌లో ఆగస్టు 1వ తేదీన జరిగే చేయూత పెన్షన్‌దారుల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ మాదిగ కోరారు. మంగళవారం నేరేడుచర్లలో జరిగిన ఎమ్మార్పీఎస్ సదస్సు సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ హాజరువుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు బచ్చలకూరి వెంకటేశ్వర్లు, గడ్డం కాశీం, సతీష్, పాల్వాయి ఉదయ్, పున్నయ్య, రాము, శ్రీనివాసరావు, పుల్లయ్య, రూపారాణి, వీరనాగలక్ష్మి, ప్రశాంతి, గోపి, రాజు, ప్రదీప్, లక్ష్మణరావు, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

రామచంద్రాపురంలో సమావేశం

గరిడేపల్లి : హుజూర్‌నగర్‌లో ఆగస్టు 1వ తేదీన నిర్వహించబోయే చేయూత పెన్షన్‌దారుల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల జిల్లా ఇన్‌చార్జ్ బచ్చలకూరి వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ. 4వేలు, వికలాంగులకు రూ. 6వేలు, అంగవైకల్యం కలిగిన వారికి రూ.15 వేలు పెన్షన్ పెంచాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత వినయ్‌బాబు, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు, బచ్చలకూరి ప్రసాద్, ఒగ్గు విశాఖ, గుండెపంగు బాబు, కోట వీరస్వామి, కుర్రి వెంకన్న, విజయ్‌కుమార్, వినోద్, సతీష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నేరేడుచర్ల : సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ సురేష్, నాయకులు

ప్రైవేటు టీచర్లకు హెల్త్ కార్డులు ఇవ్వాలి



మాట్లాడుతున్న నర్సింహరావు

మోతె : ప్రైవేటు ఉపాధ్యాయులకు ప్రభుత్వం గుర్తింపు, హెల్త్‌కార్డులు ఇవ్వాలని టీపీటీఎల్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు జె.నర్సింహరావు డిమాండ్ చేశారు. మంగళవారం మోతె మండల కేంద్రంతో పాటు మామిళ్లగూడెంలో జరిగిన ప్రైవేటు స్కూల్ టీచర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రైవేటు టీచర్ల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రైవేటు టీచర్లకు సీఎం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు జాన్ మాస్టర్, జిల్లా కార్యదర్శి వీరయ్య, కాంపాటి ఉప్పలయ్య, చిరంజీవి, ఉపేందర్, స్వప్న, శ్రీలత, ప్రసన్న, గౌతమి, మౌనిక, శారద, తదితరులు పాల్గొన్నారు.

దొడ్డా పద్మ మృతి తీరని లోటు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డా నర్సయ్య సతీమణి దొడ్డా పద్మ మృతి తీరని లోటని స్థానిక సీపీఐ నాయకులు అన్నారు. దొడ్డా పద్మ అనారోగ్యంతో మంగళవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆమె మృతి పట్ల వారు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు, దేవరం మల్లీశ్వరి, మామిడి వెంకయ్య, వై.రమేష్, దొంతగాని సత్యనారాయణ, జడ శ్రీనివాస్, కృష్ణ ఉన్నారు.

నేడు మునగాలలో రేషన్ కార్డుల పంపిణీ

మునగాల : మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ బి.రామకృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 22 గ్రామపంచాయతీల పరిధిలో 717 నూతన రేషన్‌కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



13వ వార్డులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి

నేరేడుచర్ల : వర్షాకాలం దృష్ట్యా ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి సూచించారు. మంగళవారం నేరేడుచర్ల మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 13వ వార్డులో తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తడి, పొడి చెత్తతో ఎరువుల తయారీపై వివరించారు. అనంతరం బైపాస్ రోడ్డు వెంట మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.

31న గురుకులంలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

హుజూర్‌నగర్ : పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్‌మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ దున్న వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీలో సీట్లు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఆయన తెలిపారు.

రేపు స్పాట్ కౌన్సిలింగ్

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2025– 26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఈ నెల 31న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్.వాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు సర్టిఫికెట్లు, జీరాక్స్ కాపీలు, పాస్‌ఫొటోలతో ఉదయం తొమ్మిది గంటలకు పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి కౌన్సిలింగ్ ఉంటుందని ఆమె తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మునగాల : మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఆరు నుంచి పదవ తరగతి వరకు 49 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 44 సీట్లు ఖాళీగా ఉన్నాయని వీటి భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బూర సైదయ్య గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు జూలై 31లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇంటర్‌లో ఎంపీసీ, సీఈసీ గ్రూపులలో డేస్కాలర్స్‌కే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్‌లో..

నడిగూడెం : ఓపెన్ టెన్త్, ఇంటర్మీయట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 31న లోపు నడిగూడెం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలోని అధ్యయన కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. 10వ తరగతిలో అడ్మిషన్ల కోసం టీసీ, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ ఫొటోలతో, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు పదవ తరగతి మెమో, టీసీ, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రెండు పాస్ ఫొటోలతో పాఠశాలలో సంప్రదించాలని తెలిపారు.

పాఠశాలలో టైగర్స్ డే



పులి వేషధారణలో చిన్నారులు

కోదాడ : పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో గల ఎస్‌ఆర్‌ఎం పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ టైగర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పులి ముఖ చిత్రంతో ఉన్న మాస్కులను ధరించి అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కేశినేని శ్రీదేవి, ప్రిన్సిపాల్ శ్రీవాణి, చింతకుంట్ల రామిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గంధం.. సీజనల్ భయం



టీచర్స్ కాలనీలోని మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్త

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని డ్రెయినేజీలు చెత్తాచెదారంతో నిండిపోయి దుర్వాసన వెద జల్లుతున్నాయి. ప్రధానంగా పట్టణంలోని టీచర్స్ కాలనీలోని మెయిన్‌రోడ్ వెంట డ్రెయినేజీలను నెలల తరబడి శుభ్రం చేయలేదు. దీంతో అవి చెత్తాచెదారంతో నిండాయి. మురుగు కాలువల వెంట పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రంగా మారాయి. ఈగలు, దోమలకు నిలయాలుగా మారాయి. అనేక నెలలుగా పూడిక తీయకపోవడంతో డ్రెయినేజీలు దుర్గంధం వెదజల్లుతున్నాయని ఆ కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాల్వలు శుభ్రం చేయకపోతే సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి డ్రెయినేజీలను శుభ్రం చేసి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

స్వయం సహాయక సంఘాలు బలోపేతం కావాలి

నడిగూడెం : స్వయం సహాయక సంఘాలు బలోపేతం కావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఏపీడీ సురేష్, డీపీఎం ఐబీ బెనర్జీ అన్నారు. మంగళవారం నడిగూడెం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రతి మహిళ సమభావన సంఘంలో చేరాలని, 15 నుంచి 18 సంవత్సరాలలోపు కిశోర బాలికలను సంఘాలుగా ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. 60 ఏళ్లు పైబడిన మహిళలను కూడా వృద్ధుల సమభావన సంఘాలుగా ఏర్పాటు చేయాలన్నారు. అలాగే దివ్యాంగులతో కూడా ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. స్త్రీ నిధి ద్వారా రుణాలు తీసుకున్న సభ్యులు మరణించినట్లయితే బీమా వర్తిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీఓ విజయ కుమారి, ఏపీఎం రామలక్ష్మి, సీసీలు సాంబయ్య, జ్యోతి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కంభంపాటి సరిత, కోశాధికారి ఆర్.లత, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీడీ సురేష్

సంగీతంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన ఊరె శ్రీష సంగీత ప్రపంచంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పలువురు ఆకాంక్షించారు. ఇటీవల హైదరాబాద్‌లో లిటిల్ మ్యూజికల్ అకాడమీ (ఎల్‌ఎంఏ) చైర్మన్ రామాచారి, ప్రముఖ సంగీత దర్శకుడు ఎం ఎం కీరవాణి ఆధ్వర్యంలో నిర్వహించిన పాటల ప్రదర్శన (గ్లోబల్ గ్రాండ్ ఫినాలే)లో పాల్గొన్న ఊరె శ్రీష మంగళవారం పట్టణానికి సందర్భంగా ఆమెను వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్ట్రేలియాలో ఉంటున్న డాక్టర్ ఊరె శ్రీనివాస్, స్వాతిల కూతురు 12 ఏళ్ల శ్రీష భారతీయ సంగీతాన్ని జీవనశైలిగా మలుచుకుందని అన్నారు. ఆమె ఇప్పటివరకు 120కి పైగా స్టేజ్ ప్రదర్శనలు చేసిందని తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, తమిళం, కన్నడ, మరాఠీ భాషల్లో పాటలు పాడడం ఆమె ప్రత్యేకత అని తెలిపారు. కార్యక్రమంలో ఊరె వెంకయ్య, ఇందిర, కె.పాపారావు, వెంకటేశ్వర్లు, పి.ఝాన్సీరాణి వెంకటేశ్వర్లు, టి.ప్రవళిక, హరీష్, టి.అంజయ్య, వి.నాగేశ్వరరావు, జనార్దన్, శ్రీను, నరసింహారావు, సతీష్, నాని, స్వామి తదితరులు పాల్గొన్నారు.



ఊరె శ్రీషను సన్మానిస్తున్న వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ సభ్యులు

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీసామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. విశ్వక్సేనారాదన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణ వేడుక జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అదే విధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ముత్యాలమ్మ జాతర వాయిదా

హుజూర్‌నగర్ : మండలంలోని లక్కవరంలో ఆగస్టు 3న నిర్వహించాల్సిన ముత్యాలమ్మ జాతరను ఆగస్టు 10వ తేదీకి వాయిదా వేసినట్లు జాతర నిర్వహణ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు.

వీల్‌చైర్ అందజేత



వీల్ చైర్ అందజేస్తున్న ఎంఈఓ సైదానాయక్

హుజూర్‌నగర్ : భవిత కేంద్రాలను ఉపయోగించుకోవాలని ఎంఈఓ సైదానాయక్ అన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా మంజూరైన వీల్ చైర్‌ను మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని భవిత కేంద్రంలో శారీరక వైకల్యం ఉన్న బాలుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుహాసిని, శ్రీనివాస్, అలీమ్, జయరాజు, నాగమణి, చిన్నారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

కోదాడరూరల్ : ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 35 పశువులను మంగళవారం కోదాడ రూరల్ పోలీసులు రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద పట్టుకున్నారు. ఎస్‌ఐ సీహెచ్.గోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని జగ్గంపేట సంతలో 35 పశువులను కొనుగోలు చేసి వాటిని డీసీఎంలో హైదరాబాద్‌లోని కబేలాకు తరలిస్తున్నారు. కోదాడ మండల పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్డులో వాహనాలను తనిఖీ చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా కొత్తపల్లికి చెందిన డీసీఎం డ్రైవర్ సేవా మధుబాబుతో పాటు డీసీఎం యజమాని, వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పశువులను హైదరాబాద్‌లోని జియాగూడ గోశాలకు తరలించినట్లు చెప్పారు.

బూరుగడ్డ ఆలయంలో ఆంజనేయస్వామికి ఆకుపూజ



పూజలో పాల్గొన్న ఈఓ, ధర్మకర్తలు, భక్తులు

హుజూర్‌నగర్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీ ఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాలస్వామి దివ్య క్షేత్రంలో క్షేత్రపాలకుడు శ్రీఆంజనేయస్వామికి మంగళవారం గంధ సింధూరం, 108 తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేసి పానకం, వడపప్పు, పండ్లు, నారికేళము, పులిహోర, వడమాల, ప్రసాద నివేదన చేశారు. నీరాజన మంత్ర పుష్పం అనంతరం తీర్థప్రసాదాల వినియోగం గావించారు. ఈ కార్యక్రమంలో పూజారులు, ధర్మకర్తల మండలి, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వన మహోత్సవం



మొక్క నాటుతున్న డాక్టర్ సుధాకర్‌నాయక్

మఠంపల్లి : వన మహోత్సవంలో భాగంగా మఠంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మండల వైద్యాధికారి డాక్టర్ భూక్యా సుధాకర్‌నాయక్ మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 15వ తేదీ వరకు ఆరోగ్య కేంద్రం పరిధిలో 100 మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.